# పగడము ( ప్రవాళము )

- జ్యోతిష్యరత్న డా॥వేణుగోపాల్ రావు వీరమనేని

పగడమును ప్రవాళమని గూడా పిలుస్తారు. ఇది ముదురు ఎరుపురంగు, దొండపండు రంగు, నారింజ రంగు మరియు తెలుపు రంగులో కూడా ఉంటుంది. పగడంలో మూడు రకాలున్నాయి. అవి
బ్రాహ్మణజాతి పగడం : కుందేలు రక్తపు వర్ణంలో ఉంటుంది. అతి శ్రేష్టమైనది. వైశ్య జాతి పగడం : మోదుగ పువ్వు రంగులో ఉంటుంది. ఇంద్ర జాతి పగడం : కాంతిహీనంగ వెలవెల పోయి, సామాన్యంగ కనిపిస్తుంది.

పగడములను అంగారకమణి, కుజప్రియ మరియు రక్తముకి అని కూడా పిలుస్తారు.

పగడముల పుట్టుక అనేది మిగతా నవరత్నములకన్నను భిన్నంగ ఉంటుంది. ఇవి అడవిలో చెట్టుకు లభిస్తాయని వీటిని పగడపు తీగలంటారని కొందరంటారు. సముద్రపు గర్భంలో ఒక రకమైన ప్రాణుల ఆస్థిపంజరాలని కొందరు అంటారు. మరికొంతమంది అభిప్రాయం ప్రకారం కొన్ని సముద్ర ప్రాణులు (జెల్లీ రకపు) స్రవించే పదార్థము మరియు సముద్రపు నీటిలో గల కాల్షియం కార్బొనేట్‌తో చర్యనొంది ఒక రకమైన కర్బన పదార్థం తయారై అది సముద్రంలోని రాళ్ళపై స్థిరమై పగడపు దీవులుగా రూపాంతరం చెందుతాయి. కొన్నిసార్లు ఈ పదార్థం చెట్లకు అంటుకొని పగడపు చెట్లుగా సముద్రంలో కనిపిస్తాయి. ఇలా కొన్ని దశాబ్దాలుగా పగడపు పదార్థం నిక్షిప్తమై కుందేలు రక్తపు వర్ణములో మారుతాయి. ఇవి ఉత్తమమైనవిగా భావిస్తారు.

కాల్షియం కార్బొనేట్ అన్ని సముద్రాలలో లభించినప్పటికిని, పగడములు తయారీలో ఉపయోగపడే కాల్షియం కార్బొనేట్ మాత్రం కొన్ని సముద్రాలలో మాత్రమే లభిస్తుంది. ఇవి సముద్రపు గర్భంలోని ఉష్ణోగ్రతల ఆధారంగా లభిస్తాయి.

పగడములు ఎక్కువగా కనిపించే ప్రాంతాలు మెడిటేరియన్ సముద్రము, ఆల్జీరియా, ట్యునిషియా, చిలి, జపాన్, పర్షియన్, స్పెయిన్, ఫ్రాన్స్ మరియు గల్ఫ్ దేశాలు : భౌతికపరంగ సాంద్రత - 2.65, గట్టితనం 3.5 - 4.0. వక్రీభవన సూచి 1.486 - 1.658, వేవ్‌లెన్త్ - 65,000, పగడపు కిరణాల వైబ్రేషన్ 59,100.

రసాయనశాస్త్రం పరంగ ఇది కర్బన పదార్థపు రత్నం, ఇందులో కాల్షియం కార్బొనేట్ ఉంటుంది.

ఆయుర్వేదంలో పగడంను వాడుదురు. భస్మం చేయడానికై పగడంను జిల్లేడు పాలలో మూడు రోజులు నానబెట్టి, తీసి పుటం వేసినను భస్మం తయారగును. జ్యోతిష్యశాస్త్రం ప్రకారం పగడము కుజునికి సంబంధించినది. కుజుని బలవంతుని చేయడానికి, శాంతింప చేయడానికి, ఆకర్షించడానికై పగడములను వాడుదురు. ఎవ్వరైతే ముఖ్యంగా శతృభయంతో, రోగపీడతో, పిరికితనంతో బాదింపబడుదురో వారికి పగడం మంచిది. స్త్రీలు మాంగల్యబలం కొరకై మంగళకరమైన పగడంను తమ మంగళసూత్రంలో తప్పనిసరిగా వాడుదురు. కర్మాగారాలలో పనిచేయువారు. ప్రమాదాలకు దారితీయు పరిస్థితులలో పని చేయువారు. తరచుగా వాహనంపై ప్రయాణించువారు పగడమును ధరింపవచ్చు.

పగడములు గుండ్రంగ, కోలాకారంలో, చతురస్రాకారంలో, త్రికోణాకారంలో ఉంటాయి. త్రికోణాకారపు పగడం శ్రేష్టమైనది. చతురస్రాకారపు పగడం అంత మంచిది కాదు.

మంచి పగడములను గుర్తించుటకుగాను, పగడమును నేలపై గాని రాతిపైగాని రుద్దినచో వెండివలె గీతను సృష్టిస్తుంది. పగడమును రాతిపై గీచిన, పగడముపై పడిన గీతలను, నూనెలో ముంచిన వేలితో రాసినట్లయితే గీతలు పోయి ప్రకాశవంతముగ తయారవుతుంది.

పగడంపై కొంచెం సజల ఉదజని కామ్లం చుక్కలు వేసినట్లయితే చిన్నచిన్న బుడగలు కన్పిస్తాయి. ఆమ్లం (హైడ్రోక్లోరి కామ్లం) పగడంలో కాల్షిక్షీం కార్బొనేట్‌తో చర్యనొంది. కార్బన్‌డైఆక్సైడ్‌ను ఇవ్వడంతోబుడగిలు కన్పిస్తాయి. పగడములలో మలినము (నల్లని మచ్చలు, చారలు) పుష్టి : కోమలము (పగడము మధ్యలో మరకలు), జర్జరము (పగడంపై బుడిపెలు ఉండినను), రుగ్మము (ఏదో ఒకచోట చొప్పిగా ఉన్నను) అను రకములు దోషములు కలవు. ఇలాంటివి ఉపయోగించిన చాలా ప్రమాదం.

పగడము ధరించాలనుకున్నప్పుడు జ్యోతిష్యశాస్త్రం ప్రకారం పూర్తిగ పరిశీలించ వలసి ఉన్నది. మొదటి లగ్నం గురించి తెలుసుకొందాము.

ఏ లగ్నంనకు కుజుడు అధిపతి అవునో ఆ లగ్నంలో జన్మించినవారు పగడమును జీవితాంతం

ధరించవచ్చు. అవి మేష మరియు వృశ్చిక లగ్నములు ఏ లగ్నాలకు కుజుడు పాపి అయినచో ఆ లగ్నంలో జన్మించిన వారు పగడంను వాడకపోవడం మంచిది. కాని కుజుడు ఇవియే లగ్నంలకు స్వస్థానంలో ఉన్నప్పుడు పగడం వాడవచ్చు. అవి వృషభ లగ్నం (వ్యయాధిపతి, సప్తమాధిపతి), మిధున లగ్నం (వ్యయాధిపతి, సప్తమాధిపతి), మిధున లగ్నం (లాభాదిపతి, సప్టమాధిపతి), కన్యా లగ్నం (తృతీయ, అష్టమాధిపతి), తులాలగ్నం (ద్వితీయ, సప్తమాధిపతి). ఇంతేకాక కర్కాటక లగ్నం, సింహలగ్న, ధనుర్లగ్నం, మకర లగ్నం, కుంభ మరియు మీన లగ్నములో జన్మించినవారు వాడవచ్చు.

కుజుడు లగ్నం లగ్నాధిపతి అయినను పాపి అయినను, మధ్యస్థఫలితాలు ఇచ్చినప్పటికిని కుజుడు స్వస్థానంలో ఉన్నప్పుడుగాని, కుజుమహదశ జరుగుతున్నప్పుడు గాని పగడమును ధరింపవచ్చు.

ఇదేవిధముగ రాశుల విషయానికి వస్తే మేష. వృశ్చిక రాశులవారు పగడంను ధరింపవచ్చు. మరియు నక్షత్రాల ఆధారముగ పరిశీలించినట్లయితే మృగశిర, చిత్త, ధనిష్టలకు కుజుడు అధిపతి అయినందున ఈ నక్షత్ర జాతకులు పగడం ధరింపవచ్చు.

సంఖ్యాశాస్త్రం మరియు జ్యోతిష్యం శాస్త్రంలను కలిపి పరిశీలించినట్లయితే 9 సంఖ్యకు కుజుడు అధిపతి అయినందున 9,18,27 తేదీలలో జన్మించినవారు పగడంను ధరించవచ్చు. అశ్వని నక్షత్రం 1,3,9 తేదీలలో జన్మించినవారు భరని 1,3,9 తేదీలు, కృత్తిక 1,3,6,9 తేదీలు, మృగశిర 1,3,9 తేదీలు, చిత్త 1,3,9 తేదీలు, అనురాధ 1,3,9 తేదీలు, జేష్ట 1,3,9 తేదీలు, దనిష్ట 1,3,9 తేదీలలో జన్మించినవారికి పగడం మంచి చేయును.

15 ఏప్రిల్ నుండి 15 మే మధ్యలో జన్మించిన వారికి పగడము మంచి చేయును. శత్రుసంఖ్యలయిన 2,5,7,8,11,20,14,13,24,26,17 లకు సంబందించినవారు పగడం వాడకపోవడం మంచిది. అంటే ఈ తేదీలలో జన్మించినవారికి కుజుడు శత్రువు అయినందున పగడం ధరించవద్దు.

ధరించు విధానం : పగడంను మంగళవారం రోజున కుజహోరలో కొని కుడిచేతి ఉంగరపు వేలుకు ధరించు ఉంగరంలో పొదగవలెను. ఉంగరం రాగి కలిపిన బంగారంతో చేయించవలెను. పగడం త్రిభుజాకారంలో ఉంటే మంచిది. అందులోనూ 3 నుంచి 6 క్యారెట్ల బరువు ఉండవలెను. పచ్చ, వజ్రము, నీలము, గోమేధికంలతో కలిపి పగడం కలిపి ఉపయోగించవద్దు.

ధరించు సమయం : మంగళవారం 6.00 గంటల నుండి 7.00 గలంట మధ్యలో లేక మధ్యాహ్నం 1.00 గంటల నుండి 2.00 గంటల మధ్యలో ధరించువారి తారాబలం, వర్జ్యం లేకుండా శుభతిథులలో ధరించవలెను.

పూజకు కావలసిన వస్తువులు : 1. ఎర్రని పట్టువస్త్రాలు 2. రాగి ప్లేటు 3. కందులు 4. ఎరుపు వర్ణపు పువ్వులు 5. తేనే 6. రాగులు.

విధానం : ఇష్టదైవం ముందు ఎర్రని పట్టువస్త్రాన్ని పరిచి కందులు ఆ వస్త్రంపై పోసి రాగిప్లేటును మరొక ప్లేటులో పెట్టాలి. మళ్లీ మరొక ఎరుపువస్త్రాన్ని పరిచి మరొకసారి కందులు పోయాలి.

ఉంగరాన్ని శుభ్రంగ కడిగి గంధం, కుంకుమలతో అలంకరించి, తొమ్మిది ఎరుపు వర్ణపు పువ్వులను తీసుకొని దారంతో ఉంగరంతో సహా దండమాదిరిగా కట్టవలెను. ఆదండను పట్టువస్త్రంపై పోసిన కందులపై ఉంచవలెను. రాగులు లేక ఎర్రని పుష్పాలతో కుజమంత్రాన్ని 108 సార్లు పఠించాలి. పూజ అనంతరం తేనెను ప్రసాదంగ పంచిపెట్ట వలెను. ఎర్రపప్పును ఎరుపు వర్ణము కవర్లో ఉంచి దానం చేయవలెను.

కుజమంత్రం

"ఓం వీర ధ్వజాయ విద్మహే
విఘ్న హస్తాయ దీమహే
తన్నో: జామ ప్రచోదయాత్"

ఉంగరం ధరించాలనుకున్న మంగళవారం ఉదయం స్నానపు నీటిలో చంద్రకర్ర గంధం, దేవదారు గంధం, ఉసిరికపప్పు కలుపుకొనవలెను.

ఏదేని రత్నం ధరించినప్పుడు మొదటి 3 రోజులు పరిశీలించవలెను. అనుకోని చెడు సంఘటనలు జరిగినట్లయితే ఉంగరాన్ని ధరించకపోవడం మంచిది.

కుజదోషం ఉన్నవారు ధరించినట్లయితే వివాహం ఇబ్బందులు లేకుండ జరుగుతుందని అంటుంటారు కాని, చెడు చేయు కుజుడు బలాన్ని పొంది మరీ ఎక్కువ కీడు చేయవచ్చు సుమా! ఆలోచించి ధరించవలెను.